క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

కడియం: రాజమహేంద్రవరం రూరల్ సబ్ డివిజన్ కడియం సెక్షన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక జరుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేబీవీ నటరాజన్ తెలిపారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యుడు ఎస్.రాజబాబు, ఆర్థిక సభ్యుడు ఎస్.సుబ్బారావు, స్వతంత్ర్య సభ్యుడు ఎన్.మురళీకృష్ణ హాజరవుతారన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బీవీ పట్టాభిరామ్‌కు నివాళి


పట్టాభిరామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మనోహర్ తదితరులు

సీటీఆర్ఐ: మేజిక్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రజాల నిలయంలో బుధవారం డాక్టర్ బీవీ పట్టాభిరామ్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.మనోహరరావు (స్టిక్ మనోహర్) మాట్లాడుతూ పట్టాభిరామ్ తన ప్రదర్శనలు, రచనల ద్వారా ఎంతో మందికి విజ్ఞానాన్ని అందించారన్నారు. మేజిక్ రంగ అభివృద్ధితో పాటు మెజీషియన్ల ఐక్యత కోసం ఆయన వేసిన బాటను కొనసాగించడమే ఆయనకి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మెజీషియన్లు పాల్గొన్నారు.

మహిళా జైలు సందర్శన

కంబాలచెరువు: స్థానిక సెంట్రల్ జైలులోని మహిళా కారాగారాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి బుధవారం సందర్శించారు. జైలులో వంటకు ఉపయోగించే ఆహార పదార్థాలు, పాటిస్తున్న ప్రమాణాలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కారాగారంలో ఖైదీలు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఖైదీల తరఫున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, మరే ఇతర న్యాయ సహాయం, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు వేయాలన్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకరిస్తుందన్నారు. దీనికి డీఎల్ఎస్ఏ నియమించిన పారాలీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలు అందించాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ధవళేశ్వరం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ టి.గణేష్ అన్నారు. రాజవోలులోని జెడ్పీ హైస్కూల్, ఏఎంజీ స్కూల్‌లో గురువారం సైబర్ నేరాలు, గంజాయి, మహిళల భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం ఉన్న మహిళా చట్టాలను వివరించారు. టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, నేరస్తుల కదలికలపై సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ సురేష్, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మామూళ్లకు రియల్టర్ల హడల్


మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మామూళ్ల దెబ్బకు నియోజకవర్గంలో రియల్టర్లు కొత్త లేఅవుట్లు వేయడానికి భయపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన కుటుంబానిది 55 ఏళ్ల రాజకీయ ప్రస్థానమని చెబుతున్నారని, ఆయన స్వర్గీయ నల్లమిల్లి మూలారెడ్డికి వారసుడైతే కావచ్చుకాని రాజకీయాలలో మాత్రం కాదని ఆయన గౌరవం పెంచే పనులు ఏమీచేయలేదన్నారు. మూలారెడ్డికి తమకు రాజకీయ వైరం ఉన్నప్పటికి వ్యక్తిగతంగా అందరితోనూ కలసి మెలసి ఉండేవారన్నారు. ఆయన తనయుడు మాత్రం వ్యక్తిగత కక్షలతో ప్రతిపక్ష నేతలపై భౌతిక దాడులు చేయిస్తూ, గృహాలు కూల్చుతూ ధ్వంస రచన చేసి, నియోజకవర్గంలో ఎప్పుడూ లేని దుష్ట సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారన్నారు. సొంత పార్టీ నేతల నుంచి కూడా ముడుపులు తీసుకుంటున్నారని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారన్నారు. మూలారెడ్డి చివరి శ్వాస వరకు ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారని, పదవుల కోసమో మరేదో ఆశించి పార్టీలు మారలేదన్నారు. రామకృష్ణారెడ్డి మాత్రం దానికి భిన్నంగా టక్కుటమార విద్యలన్నీ ప్రదర్శించి, పదవి కోసం పార్టీ మారి, మనసు ఇక్కడ మనువు అక్కడ అన్న చందంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ తరహా రాజకీయాలు ఎంతో కాలం సాగవని, ఇప్పటికే కూటమిలోని మూడు పార్టీల నాయకుల్లోనూ ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తి సెగలు మొదలయ్యాయన్నారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం..


గోతులమయంగా మారిన గోరక్షణ పేట రోడ్డు


కటారి నగర్ రోడ్డు దుస్థితి



పేపర్ మిల్లు డౌన్‌లోని పెట్రోల్ బంకు దగ్గర..

- అధ్వానంగా రహదారులు
- గోతులతో రాకపోకలకు అవస్థలు
- వర్షాలు కురవడంతో మరింత ప్రమాదం
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు

సీటీఆర్ఐ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో రహదారులు అధ్వానంగా మారాయి. వాటిపై ప్రయాణించాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. అసలే ట్రాఫిక్ రద్దీ, ఆపైన గోతుల రహదారులపై రాకపోకలకు వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. దీనికి తోడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. వాటిపై నీరు నిల్వ ఉండిపోయింది. ఆ గోతులు నీటితో నిండిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ రోడ్డు బాగుందో తెలియక అవస్థలు పడుతున్నారు. మునిగిపోయిన రోడ్లపై ప్రయాణిస్తూ గోతుల్లో పడి పలువురు గాయాలపాలవుతున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

ప్రచారానికే పరిమితం

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు అనేక వాగ్దానాలు చేశారు. ముఖ్యంగా రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీలు ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ విషయం మర్చిపోయారు. అద్దంలా కాదుకదా, ప్రయాణానికి కూడా అనువుగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి అధికారంలోకి ఏడాది పూర్తయినా రాజమహేంద్రవరంలో రోడ్లకు మోక్షం కలగలేదు. నగరంలో అనేక చోట్ల డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసుకుంటూ వెళ్లిపోవడమే తప్ప, కొత్తగా నిర్మించినవి ఏమీ లేవు. కొన్ని చోట్ల రోడ్లపై గుంతలను మాత్రం పూడ్చారు. మరికొన్ని చోట్ల రోడ్ల పనులు సాగుతూనే ఉన్నాయి.

అస్తవ్యస్తంగా..

జిల్లాలోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన రాజమహేంద్రవరానికి రోజూ సుమారు లక్ష మంది వరకూ వస్తుంటారు. క్రయ, విక్రయాలు కూడా రూ.లక్షల్లో జరుగుతుంటాయి. కొవ్వూరు, కాకినాడ, అమలాపురం, గోకవరం వంటి ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారాలు సాగిస్తున్నారు. అంతేకాకుండా నేషనల్ హైవే కూడా ఇక్కడ ఉండటంతో పెద్ద పెద్ద వాహనాలు కూడా తిరుగుతుంటాయి. ఆటోలు, చిరు వ్యాపారస్తులు, స్కూలు బస్సులు, రవాణా వాహనాలు, బైకులపై వచ్చిపోయే వారు లెక్కే ఉండరు. వీరంతా నగరంలో పలు చోట్ల వ్యాపారులు చేసుకోవడానికి వస్తుంటారు. రహదారులు శిథిలం కావడంతో వీరందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్వారీ మార్కెట్ రోడ్డు, లాలా చెరువు రోడ్డు, పేపర్ మిల్లు రోడ్డు, కోరుకొండ రోడ్డు, తాడితోట సెంటర్, కాతేరు, ఆనంద్ నగర్, తుమ్మలావ, ఆర్యాపురం, వీరభద్రపురం, కటారి నగర్, కంబాల చెరువు మదర్ థెరిస్సా పార్క్ వద్ద, ఇన్‌కమ్ టాక్స్ ఆఫీస్ సమీపంలో రహదారిపై గుంతలు ఎక్కువగా ఉంటున్నాయి.

భరత్ రామ్‌పై కాదు.. అభివృద్ధిపై దృష్టి పెట్టండి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పులి సాగర్

- కూటమి పాలనలో ఇసుక అక్రమ తవ్వకాలు
- విలేకరుల సమావేశంలో పులి సాగర్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ నాయకుల మాదిరిగా బెదిరింపు రాజకీయాలు తమకు అలవాటు లేదని వైఎస్సార్ సీపీ నాయకుడు పులి సాగర్ ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నక్కా దేవీవరప్రసాద్, యిన్నమూరి దీపు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. విద్యావంతుడైన మాజీ ఎంపీ భరత్‌కు బెదిరింపులకు పాల్పడాల్సిన అవసరం లేదన్నారు. భరత్‌రామ్ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం ప్రజల మధ్యలోనే ఉన్నారని, ఇప్పుడు కూడా ఉంటున్నారన్నారు. కూటమి పాలనలో ఇసుకను యథేచ్ఛగా తవ్వేస్తున్నారని, ఇలాంటి ఘటన ఎప్పుడూ లేదన్నారు. రెడ్‌బుక్‌లో ఉన్న వారికి రాజ్యాంగ బద్ధంగా శిక్ష పడేలా చేస్తున్నారని టీడీపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నిజానికి గోదావరికి తూట్లు పడేలా ఇసుక దోచుకో, డబ్బు దాచుకో అనే రీతిలో టీడీపీ అధికారం వచ్చాకే జరుగుతోందన్నారు. చిన్న వర్షం వస్తే మునిగిపోతున్న నగరంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని టీడీపీ నాయకులు వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. కృష్ణానగర్ డ్రైనేజీ పని మొదలుపెట్టి ఏడాది దాటినా, ఇంతవరకూ పూర్తి కాలేదదన్నారు. ఆ రోడ్డు భరత్ రామ్ హయాంలో పూర్తయిందని, డ్రైనేజీ ఇప్పటి వరకూ పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. నగరంలో 20 పార్కులను భరత్ రామ్ అభివృద్ధి చేశారని, మీరు రెండు పార్కులు అభివృద్ధి చేసి గొప్పలు చెప్పుకోవడం వింతగా ఉందన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధం


సబ్బెళ్ల కృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: కూటమి ప్రభుత్వంపై ప్రజలలో ఉన్న వ్యతిరేకతను మళ్లించడానికే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. ఆయన రాజమహేంద్రవరంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం కేసు అనే ఒక అభూత కల్పనను అధికారులు సృష్టించి రాష్ట్ర స్థాయిలో చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వంటి నాయకులను అరెస్ట్ చేశారన్నారు. ఎంతోకాలంగా రాజమహేంద్రవరం పేపర్ మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయని, వాటిపై ఆమరణ నిరాహార దీక్షకు దిగిన రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను హౌస్ అరెస్ట్ చేసి ఉద్యమాన్ని అణచాలని ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. అక్రమ అరెస్టులు చేసి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తోందని, ఏడాది కాలంగా ఎన్నికల హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రజా వ్యతిరేకత పెరిగిందని, దాని నుంచి బయటపడడానికే ప్రభుత్వం లేనిపోని కేసులను సృష్టించి, వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తోందన్నారు.

ప్రతిపక్షం గొంతునొక్కడమే కూటమి అజెండా


ఆరీఫుల్లాఖాన్

ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతల గొంతు నొక్కడమే అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాజమండ్రి సిటీ అధ్యక్షుడు ఎండీ ఆరీఫుల్లా ఖాన్ ఆరోపించారు. ఇది కూటమి పాలన కాదని కుతంత్రాల పాలన అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా డైవర్షన్ పాలిటిక్స్‌తో పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో అరాచకాలను సృష్టిస్తూ అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాంలో అక్రమంగా ఇరికించారన్నారు.

దృష్టి మరల్చేందుకే అరెస్టులు


కొత్తపల్లి నాగ శివాజీ

కడియం: ప్రజా సమస్యలు పరిష్కరించలేక, సంక్షేమ పథకాలను అమలు చేయలేకపోతున్న కూటమి ప్రభుత్వం.. ఆ విషయాల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి నాగ శివాజీ ఆరోపించారు. ఆయన బుర్రిలంకలో విలేకరులతో మాట్లాడారు. పేపరుమిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాను పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి రాజకీయ కుట్రల్లో భాగంగా ఎంపీ మిథున్‌రెడ్డిపై లిక్కర్ కేసును మోపి, అరెస్టు చేశారన్నారు. మద్యం, ఇసుక మాఫియాగా కూటమి నేతలు మారి ప్రజల సంపదను దోచుకుంటున్నారన్నారు. వాటిని అడ్డుకోవడంలో విఫలమైన ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడే వారిని మాత్రం అక్రమంగా అరెస్టు చేస్తోందన్నారు.

'చాగల్నాడు' నుంచి నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న మంత్రి గొట్టిపాటి మురళి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలోని చాగల్నాడు ఎత్తిపోతల పథకం నుంచి నీటిని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం విడుదల చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ మొదటి దశ సాగు నీటిని విడుదల చేసేందుకు గోదావరి నదికి హారతులిచ్చి, అనంతరం మోటార్ స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ, చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని రంగంపేట, కోరుకొండ, రాజానగరం మండలాల్లో ఉన్న 6,250 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు వివరించారు. చాగల్నాడు మొదటి దశ నుంచి లీడింగ్ చానల్ ద్వారా కోలమూరులోని రెండో దశకు, అక్కడి నుంచి మరో లీడింగ్ చానల్ ద్వారా పాలచర్లలోని మూడో దశకు, అక్కడి నుంచి కాలువల ద్వారా పొలాలకు సాగు నీరు చేరుతుందని తెలిపారు. మొదటి దశలో ఒక పంపు మాత్రమే పనిచేస్తోందని, మిగిలిన వాటికి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జల వనరుల శాఖ ఈఈ కె.వెంకటేశ్వరరావు, డీఈ పి.పురుషోత్తం దొర, ఏఈ పి.సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సాగులో అధిక దిగుబడులు సాధించాలి


సమిశ్రగూడెంలో ఖరీఫ్ సాగుపై రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నిడదవోలు రూరల్: తక్కువ ఎరువుల వినియోగంతో అధిక పంట దిగుబడులు సాధించేలా రైతులు సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఏఈఓ శివనాగు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు దాసు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- పడకేసిన పారిశుధ్యం
- విధులను బహిష్కరించిన పంచాయతీ కార్మికులు
- వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



బొమ్మూరు రాఘవేంద్ర నగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ పంచాయతీ కార్మికులు తమకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఐదు రోజులుగా విధులను బహిష్కరించారు. దీంతో ఆ గ్రామమంతా చెత్తమయంగా మారింది. టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్న రూరల్ నియోజకవర్గంలోని బొమ్మూరు గ్రామ పంచాయతీ కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. అయినా వారి జీతాలు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. దీంతో ఐదు రోజులుగా విధులను బహిష్కరించారు. ఆ గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య వ్యవస్థ పూర్తిస్థాయిలో పడకేసింది. డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపై మురుగునీరు ప్రవహించే పరిస్థితి నెలకొంది. దీనివల్ల ఎటువంటి రోగాలు వస్తాయోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంచాయతీ కార్మికుల జీతాల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


బొమ్మూరు వెంకటగిరి కొండపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ


టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్ ఇంటి సమీపంలో పేరుకుపోయిన చెత్త


మురళీకొండ వద్ద చెత్తకుప్ప

అడవుల సంరక్షణ ప్రధాన బాధ్యత


శిక్షణలో మాట్లాడుతున్న ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ విజయ్ కుమార్

రాజానగరం: అడవులు, వాటిలో ఉండే వన్య ప్రాణులను సంరక్షించడం అటవీ శాఖ ఉద్యోగుల ప్రధాన బాధ్యతని, అందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ఉద్దేశమని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ బి.విజయ్ కుమార్ అన్నారు. దివాన్ చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్టు అకాడమీలో 13వ బ్యాచ్ ఫారెస్టు బీట్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరు నెలల కాల వ్యవధితో కూడిన ఈ శిక్షణలో 22 విభాగాలలోని 38 మంది ఎఫ్‌బీఓలు పాల్గొంటున్నారు. కోర్సు డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరెడ్డి కోర్సు వివరాలను తెలియజేశారు.

పేకాట శిబిరంపై దాడి

రాజమహేంద్రవరం రూరల్: హోటల్ షెల్టాన్ వెనుక రెల్లిపేటలో మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో బొమ్మూరు ఎస్సై అంకారావు, సిబ్బందితో కలసి పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పది మందిని అరెస్టు చేసి, పేకముక్కలు, రూ.21,130 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రకాశం నగర్: ప్రజల జేబులను ఖాళీ చేసే స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని, వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే గృహ వినియోగదారులు అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దంటూ రూపొందించిన పోస్టర్లను ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ బిల్లులతో పాటు సుమారు రూ.9 వేల నుంచి రూ.17 వేల వరకు స్మార్ట్ మీటర్ చార్జీలు సైతం వినియోగదారుడి వద్ద నుంచి వసూలు చేసేందుకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. పేపర్ మిల్లు యాజమాన్యం పాలక ప్రభుత్వం అండతో నిరంకుశత్వంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కార కోసం పార్టీలకతీతంగా మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు రాంబాబు, బి.పవన్, వి.రామచంద్రరావు, పూర్ణిమరాజు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో సీపీఐ మహాసభలు

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరంలో ఆగస్టు 6, 7 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు నిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం 31వ నగర సభ జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వనజ మాట్లాడుతూ పేదలకు అండ ఎర్ర జెండా మాత్రమేనని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాద దాడులు పెరిగాయన్నారు. అనంతరం నగర నూతన కమిటీ ఎంపిక చేశారు. నగర కార్యదర్శిగా వి.కొండలరావు, సహాయ కార్యదర్శులుగా సప్పా రమణ, పి.లావణ్య ఎన్నికయ్యారు.

ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం మీదే


సమావేశంలో మాట్లాడుతున్న మేజర్ మహ్మద్ ఆసిఫ్

రాజానగరం: అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే విజయం మీదేనని 18వ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌లో బుధవారం జరిగిన కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో ఎంతో ఉన్నతమైనదన్నారు. ఆ వయసులో చేసుకునే అలవాట్లు, వ్యవహారాలు, లక్ష్యసాధన, నాయకత్వ లక్షణాలపైనే తదుపరి జీవితం ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ మీ భవిష్యత్తుకు మీరే మార్గదర్శకులనే విషయాన్ని మరువరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి, విమల, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు


ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ధవళేశ్వరం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభానికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని కోరుతూ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను) ఆధ్వర్యంలో ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దాల అను మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని, పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ లింగం రవి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ తదితరులు ముద్రగడ కోసం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిష్, రమణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఫెడరేషన్ సభ్యురాలిగా లలితా దేవి

ప్రకాశం నగర్: వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అథ్లెట్ కమిషన్ సభ్యురాలిగా యండమూరి లలితాదేవి ఎంపికైనట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కారవర్గ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియ ఈనెల 21న రాజస్థాన్‌లో జరిగిందన్నారు. దేశం నుంచి నలుగురు క్రీడాకారిణులను ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోగా, వారిలో రాజమహేంద్రవరం నుంచి లలితా దేవి అత్యంత మెజారిటీతో విజయం సాధించిందన్నారు.